# నరకంలో నిమిషం

మబ్బుల్లేకపోయినా మెరుపులు మెరవడం, రాత్రి కాకపోయినా నక్షత్రాలు కనపడడం అంటే ఏమిటో ఆ క్షణంలో - ఏ క్షణంలోనంటే - సైకిలు వాడిని తప్పించబోయి, మోటారు సైకిలువాడు సైడున నడుస్తున్న నామీదకు రావడం, బాలన్స్ తప్పి నేను కింద పడడం - పడ్డంలో తల వెళ్లి పేవుమెంటుకి తగిలినపుడు నక్షత్రాలు కనపడటం అంటే ఏమిటో అర్థం అయింది. బుద్ధిగా రోడ్డు మీద కీప్‌లెఫ్ట్ సూత్రం పాటిస్తూ, కింద, ఎదుట మార్చి మార్చి చూసుకుంటూ, కింద గతుకులలో, ఎగుడుదిగుడుల్లో కాలు పడి బెణకడమో, విరగడమో జరక్కుండా, ఎదురుగా చూసుకోకపోతే ఎవరొచ్చి గుద్దుతారో, మనం వెళ్లి దేన్ని గుద్దుతామో తెలియదు కనక కిందా మీద చూసుకోవాలి, మన రోడ్ల మీద నడవాలంటే, రోడ్డు మీదెందుకు నడవడం పేవుమెంటు మీద నడవచ్చుగా అంటున్నారా - భలేవారే. మన హైదరాబాదులో పేవుమెంట్లెక్కడే తల్లీ - అని తవ్వడానికి, పూడ్చడానికో తప్ప నడవడానికున్నాయా - నిరుపేదల 'భుక్తి' మార్గం (భ కాదు) చూపడానికి మున్సిపాలిటీ వారు ఉదారంగా పేవుమెంట్లు తవ్వుట, పూడ్చుట అనే కార్యక్రమం ఆరంభించి నిరవధికంగా నడిపిస్తుంటారన్నమాట - రేపు అంటే భవిష్యత్తులో - అంటే ఏ వందేళ్ల తర్వాతో చరిత్ర పుస్తకంలో ఆంధ్రప్రదేశం గురించి రాసినపుడు ఫలానా కాలంలో బీదల భుక్తికి పేవుమెంటల తవ్వు కార్యక్రమం ఆరంభించారన్న వార్త తప్పకుండా వుంటుంది. అశోకుడు చెట్లు నాటించెను, బావులు తవ్వించెను అని మనం యిప్పుడు చరిత్ర పుస్తకాలలో చదువుతున్నటన్న మాట!

ఖర్మకాలి బండలు పరిచి, సిమెంటు చేసి అమ్మయ్య పని పూర్తయింది అనుకుని మనలాంటి వాళ్లు నిట్టూర్చేవేళకి 'అమ్మా మీకెంత ధైర్యం, మాకు

చెప్పకుండా వేసేస్తారా బండలు' అన్నట్టు ఏ ఎలక్ట్రిసిటీ వాళ్లో, మున్సిపాలిటీ, వాటర్ వర్క్స్, అదీకాక ఏ రిలయన్స్ కేబుల్ వాళ్లో - మా గతేం కావాలి. మా పనులు వద్దా అన్నట్టు మళ్లీ తవ్వడం మొదలు పెడతారు. అదీకాక ఎవరూ తవ్వకుండా నాల్గురోజులు నీట్‌గా వున్నా మధ్య మధ్య పట్టణ సౌందర్యానికి నాటిన మొక్కల మధ్య ఏ భేల్‌పూరివాడో, మొక్కజొన్న పొత్తులు కాల్చేవాడో, క్షురకుడో, చెప్పులు కుట్టేవాడో పేవుమెంటు మా జన్మహక్కన్నట్టు ఆక్రమిస్తారు. అంచేత పేవుమెంట్ అనేది రోడ్డుకి - చీరకి బోర్డరులా - అందానికి తప్ప నడక్కి కాదు అని పాదచారులందరూ గుర్తించి రోడ్డుమీదనే నడకకి అలవాటు పడతారు.

సాయంత్రాలు అలా ఓ రౌండు కొట్టి, కాస్త స్వచ్ఛమైన ఆక్సిజన్ పీల్చుకుని,యింటికి, వంటికి కావల్సిన పళ్ళు ఫలాలు, కూర-నార కొనుక్కు రావడం అలవాటు. సరే ఏ దుర్ముహూర్తాన బయలుదేరానో గాని మోటరు సైకిలు వాత పడ్డాను. కళ్లు చీకట్లు కమ్మి, మెరుపులు మెరిసి జర్రున ఏ అగాధంలోకో జారిపోయాను. ఆ అగాధంలోంచి వెంటనే తారాజువ్వలా ఓ కాంతిపుంజం ఆకాశంలోకి దూసుకుపోయింది - అలా గాల్లో తేలి ఎటో వెళ్ళి వాలను పక్షిలా.

కళ్లిప్పి చుట్టూ చూసేసరికి మన సినిమాల్లో చూపే యమలోకం సీనులా వుంది. 'లావుండటం ఏమిటి - యమలోకమే'. అయ్యా బాబోయ్ యిక్కడికెలా వచ్చాను. చచ్చిపోతే యమలోకానికితీసుకొచ్చారా? ఆశ్చర్యంగా, భయంగా చుట్టూ చూస్తుండగానే పొగమంచులాంటి పొగ కరిగిపోయి, ఓ పెద్ద సింహాసనం మీద నల్లగా పెద్ద మీసాలతో యముడు గాబోలు కూర్చుని మీసాలుదువ్వుకుంటున్నాడు. కింద ఆసనం మీద ఓ కంప్యూటర్ లాంటి దాని ముందు కూర్చుని ఏవేవో మీటలు నొక్కుతున్నాడింకో ఆయన. అతని పేరేమిటి చెప్మా అని గుర్తు తెచ్చుకునేలోగానే "చిత్రగుప్తా, ఎవరీ ఆడప్రాణి. ఏ ప్రాంతానికి చెందినది, ఆయువు తీరిన సహజ మరణమా, అకాల మరణమా, క్రెడిట్, డెబిట్ బాలన్సులు సరి చూసి చెప్పుము " అన్నాడు గంభీరంగా.

చిత్రగుప్తుడన్నమాట - యముడి పర్సనల్ అసిస్టెంటన్నమాట. 'ఇదేమిటి బాబూ, ఆ దెబ్బకి నేను చచ్చిపోయి నరకంలో వచ్చి పడ్డానా దేవుడా, అన్ని పాపాలు చేశానా' అనుకుని బితుకు బితుకుమని చూస్తూ నిలబడ్డాను. చిత్రగుప్తుడు చిట్టావర్జాలు తిరగేస్తూ టక టక కీ బోర్డుమీద మీటలు నొక్కి "కలియుగే ప్రథమపాదే, జంబూద్వీపే., భరతవర్షే భరతఖండే.. శ్రీశైలస్య వాయవ్య ప్రదేశే హైదరాబాదు నివాసే... కామేశ్వరీ నామ ధేయస్యే..."

''అబ్బ, ఆగవయ్యా, సంకల్పాలు అవి వదిలేసి టక టక చెప్పేయి వివరాలు అవన్నీ వినే టైము లేదు. కుప్పతెప్పలు వచ్చి పడుతున్నాయి ఆత్మలు. అదిగో ఏదో ఏక్సిడెంట్ కేసులు గాబోలు బండెడు వస్తున్నాయి. సెటిల్ చెయ్యాలి గదా అన్నీ. త్వరగా '' యముడు విసుక్కుంటూ అన్నాడు.

చిత్రగుప్తుడు కాస్త మొహం మాడ్చుకొని '' అయ్యా, మరి కాలమాన ప్రదేశాలు చెప్పాలి. ఎవరో, ఏమిటో కంప్యూటర్ చెప్పిందే చెప్తున్నాను''

''ఓహో అందుకన్నమాట మనం ఏ పూజలు, వ్రతాలు, నోములు చేసినా సంకల్పం చెప్పుకోవడం - అవును మరి మనం చెప్పనిదే మనం యంతెంత మంచి పనులు చేస్తున్నట్టు తెలిస్తే గదా చిట్టా (క్రెడిట్) లోకి ఎక్కిస్తారు - మన పాప పుణ్యాలు క్రెడిట్ డెబిట్ చిట్టాలోకి ఎక్కితే గదా మన బాలన్స్‌షీట్ తయారవుతుంది అనుకున్నాను. అయితే ఇప్పుడిక్కడా కంప్యూటర్లు వచ్చాయన్నమాట!

''సరే, సరే, ఈ జీవి ఏమన్నా మంచి పుణ్యకార్యాలు, దానధర్మాలు, పూజలు గట్రా చేసిందా - అటులనే ఏ పాపములు చేసినది, జీవహింస, అసత్యములు పల్కుట, హత్యాకాండలు వగైరా పాపకర్మములు చేసి యున్నదా?''

''అబ్బే పెద్దగా పాపకర్మలు కావు - ఏదో చిన్నప్పుడు పిచ్చుక గూళ్ళులోని గుడ్లు తీయుట - కుక్క పిల్లలని తల్లినుంచి దాచి ఏడ్పించుట - చీమల బారులపై నీరుపోసి చెరుపుట - బొద్దింకలలాంటి ప్రాణులను చంపుట లాంటి చిన్న చిన్న పాపకార్యములు, అవసరార్థం అసత్యాలు చెప్పుట తప్ప పెద్ద పాపాలు లేవు. అలాగే పెద్దగా పూజలు, నోములు, వ్రతాలు, దానధర్మములను చేయలేదు. రోజూ ఏదో దేమునికి దీపం పెట్టుట, కనిపించిన ముష్టివాడికో రూపాయి, అప్పుడప్పుడు ఏ అనాథ శరణాలయానికో బట్టలు, డబ్బులు దానం తప్ప గొప్ప పుణ్యకార్యములను చేసిన మనిషి కాదు''.

''అటులనా! తోటి మానవుల పట్ల దయ, పశుపక్ష్యాదుల పట్ల కరుణ వుండి, భర్తని దైవముగా భావించి భార్యగా, తల్లిగా విధులు, సంసారంలో తన కర్తవ్యం నిర్వహించినదా'' యముడు ఆరాతీశాడు.

చిత్రగుప్తుడు కంప్యూటర్లోకి చూస్తూ ''పెద్ద చెప్పడానికి ఏం లేదులెండి. పిల్లల తల్లిగా తన భాద్యత సక్రమంగానే నిర్వర్తించింది. భర్తని దైవంగా భావించలేదు. భార్య భర్త అంటే బండికి రెండు చక్రాలు - ఒకరు ఎక్కువ, తక్కువా కాదు.

సమభాగస్థులం, భర్త అంటే దైవమెలా అవుతాడు అనే రకం భావాలున్న ఆవిడలెండి. ఇద్దరి భుజంమీద చెరో కావడి ఉన్నప్పుడు యిద్దరికి సమాన స్థాయే...''

''చాలా గర్విష్ఠా, మూర్ఖురాలా. భర్తని బాధలు పెట్టినదా. భర్త మంచి వాడేనా?''

''అబ్బే అదేం కాదండి. ఈవిడ రచయిత్రిలెండి. కాస్త స్వతంత్ర భావాలున్న మనిషి, స్త్రీ సమానత్వంలాంటి కథలు రాస్తుంది గదా...''

''ఏమిటి ఈవిడ రచయిత్రా... ఏ ఏ గ్రంథవములు రాసింది - పురాణాలు, కావ్యాలు రాసినదా?'' యముడు కుతూహలంగా అడిగాడు.

''అబ్బే కావ్యాలు, పురాణాలు రాసేంత భాషలేదులెండి ఆవిడకి. ఏదో ఆడాళ్ల కథలు, మొగుడు పెళ్లాల సమస్యలు రాసుకుంటూ వుంటుంది.''

''విప్లవ ధోరణా, సమాజాన్ని పాడుచేసే కథలా...''

''విప్లవాలు, స్త్రీ వాదాలు ఆవిడేం రాయలేదు స్త్రీ పురుష సమానత్వం, అణగదొక్కబడిన స్త్రీ జాతి పురుషుడి కంటే దేన్లోనూ తక్కువకాదు - స్త్రీ స్వేచ్ఛ అంటే విచ్చలవిడితనం కాదు, స్త్రీలు తన హక్కుల్ని పోరాడి గెల్చుకోవాలి - సమాజంలో కుటుంబ వ్యవస్థ సరిగా వుండాలంటే స్త్రీ పురుష బేదాలు తగ్గి స్త్రీని గౌరవించినపుడే సాధ్యం - లాంటి భావాలు రాస్తుంది. వ్యక్తిత్వం, ఆత్మాభిమానం లాంటి పదాలు ఆవిడకిష్టం. అవే రాస్తుంటుంది.''

''అటులనా, చిత్రగుప్తా'' అంటూ యముడు గొంతు తగ్గించి - ''మన నరకంలో యిలాంటి కథలు రాసే రచయిత్రి వుంటే మన స్త్రీలు పాతివ్రత్యం, ధర్మం మరిచి స్త్రీ స్వేచ్ఛలాంటి పదాలు నేర్చుకుందురేమో - అపుడెపుడో 'యమగోల' సినిమాలో రామారావనే హీరో యిక్కడ యూనియన్లు అవీ పెట్టి గొడవ చేసిన వైనం చూశాం గదా. మనకెందుకీ తలనెప్పి, అట్టే పాపాలు చెయ్యలేదుగా, తొందరగా స్వర్గానికి పంపేయుము'' యముడు ఆర్డరు వేసాడు. బతికానురా బాబూ అనుక్నాను.

''వద్దు యమధర్మరాజా - ఆమెని స్వర్గానికి వద్దు. ఆ నరకంలోనే పడి వుండనీయండి'' దివ్య దృష్టితో యముడు, చిత్రగుప్తుడి మాటలు విన్న ఇంద్రుడు అన్నాడు.

'దివ్య దృష్టి' అంటే మరేంలేదులెండి. యిప్పుడు మన ముఖ్యమంత్రులు 'టెలీకాన్ఫరెన్సు'లు నిర్వహిస్తున్నట్లన్నమాట - హైదరాబాదులో కూర్చుని ప్రతి

జిల్లా అధికారులతో మాట్లాడుతూ అన్నీ చూస్తూ, వినగలుగుతున్నారు గదా. తెల్లవాళ్లు యీ యుగంలో కనిపెట్టిన టెలివిజన్లు, కంప్యూటర్లు లాంటి వాటిని మనవాళ్లు పురాణకాలంలోనే కనిపెట్టారు గదా.

''అదెట్లు ఇంద్రా, జీవికి నరకము చవిచూశాక స్వర్గప్రాప్తి తప్పదు గదా – చేసిన పాపపుణ్యాలనుబట్టి ఒక రోజో, సంవత్సరమో, కొన్ని సంవత్సరాలో చేసిన పుణ్యమును బట్టి స్వర్గప్రాప్తి లభించవలెను గదా! అదెట్లా మనము తప్పించగలం''

''ఏమో యమధర్మరాజా – ఏదో ఒకటి చేయుము. అప్పుడే మన సంభాషణ రంభ, తిలోత్తమాదులు వింటున్నారు కుతూహలంగా – మన ఆడవాళ్లకి లేనిపోనివి నేర్పితే కష్టం''.

ఇంద్రుడు అంటుండగానే కంప్యూటర్లోంచి 'కీ, కీ' అంటూ శబ్దాలు వచ్చి ఫ్లాష్ వెలిగింది. ఇంకో ప్రాణి వచ్చిన సంకేతం గాబోలు – కంప్యూటర్ ముందు కూర్చున్న చిత్రగుప్తుడు ఆయోమయంగా ఒక్కక్షణం చూసి తెల్లమొహం వేసి గాభరాగా – ''అయ్యా, యమధర్మరాజా... పొరపాటు, పెద్ద తప్పు జరిగిపోయింది స్వామి. మన భటులు పొరపాటున యీమెను తీసుకువచ్చారు. యిదే పేరు, యిదే వూరు, యిదే ఇంటి పేరుతో ఒక కాన్సర్ రోగికి కాలపరిమితి సమాప్తి అయింది. క్షణం క్రితమే ప్రాణం విడిచింది. యీ ఏక్సిడెంటు కేసులో ఈమె పేరు, ఆమె పేరు ఒకటే ఆవడంతో భటులు పొరపాటున యీ జీవిని తీసుకువచ్చారు. అపరాధం మన్నించండి'' టక టక మీటలు నొక్కుతూజరిగిన పొరపాటుని రూఢి చేసుకున్నడు చిత్రగుప్తుడు.

యముడు కానున్న కార్యం గంధర్వులే తీర్చారన్నట్టు తేలికగా నిట్టూర్చి ''మన సమస్య తీరిపోయింది. వెంటనే ఈ జీవిని పంపేయి భూమ్మీదకి. ప్రాణం పోయి నిమిషమే గదా అయింది. ఏక్సిడెంట్‌లో ప్రాణం పోలేదని చచ్చి బతికిందని సంతోషిస్తారు ఆమె బంధు జనం. కావలిస్తే మనం చేసిన పొరపాటుకి బదులుగా ఆమెకి యింకో ఐదో పదో ఏళ్లు అయుష్షు బోనస్‌గా యిచ్చేద్దాం. ఇంకో పది నవలలు, వంద కథలు రాసుకోనీయి. ఇంకా కావలసిస్తే బహుమతిగా ఓ నాలుగు అవార్డులు, సన్మానాలు, డాక్టరేట్లు, యింకా కావలిస్తే ఏ పద్మశ్రీలో అన్నీ ప్రసాదించేయి. ఊ – పంపేయి త్వరగా – నెక్ట్స్'' అన్నాడు యమధర్మరాజు.

★ ★ ★ ★ ★

కళ్లమీద బేపు అతికించినట్టు కళ్లు తెరవాలన్నా తెరవలేకపోతున్నాను. ఏదో లోకంలో ఎవరో మాట్లాడుతున్నట్టు, ఎక్కడో లీలగా గొంతులు వినిపిస్తున్నాయి.

కళ్ల ముందు భరించలేనంత వెలుగు – ''అదిగో తెలివి వస్తూంది. – థాంక్ గాడ్ ప్రాణం పోయిందనే అనుకున్నాను. గుండె, మెదడు అన్నీ ఫంక్షన్ చేయడం మానేసినా, నిజంగా మిరకిల్ జరిగినట్టే మళ్లీ గుండె కొట్టుకోడం ఆరంభించింది. అదృష్టవంతురాలు''.

''మేడమ్ ఆర్ యూ హియరింగ్.. మేడమ్ వినిపిస్తున్నదా కళ్లు తెరవండి. బహన్‌జీ ఆప్ కో సునాయిదేరే''

నేనే భాషదాన్నో తెలియక పాపం ఆ డాక్టర్ అన్ని భాషల్లో పలకరిస్తున్నారు.

''మేడమ్ కళ్లు తెరవండి. యూ ఆర్ ఆల్ రైట్'' అన్నాడు మళ్లీ. కళ్లకంటించిన టేపు నెమ్మదిగా విడినట్టు కళ్లు తెరిచాను. అరడజను మొహాలు నామీదకి వంగి నన్ను చూస్తున్నాయి. టీ.వి. సీరియల్లో మాదిరి ఒక్కొక్కరి ఎక్స్‌ప్రెషన్ ఒకోసారి చూపిస్తూ కాలయాపన చేస్తున్నట్టు అంతా ఒకరి మొహం ఒకరు చూస్తుకుంటున్నారు.

''నే బతికానా మళ్లీ'' అన్నాను అయోమయంగా.

''యూ అర్ లక్కీ మేడమ్, చచ్చి బతకడం అంటే ఇదేనేమో'' అన్నాడు డాక్టరు.

నేనన్నమాట 'మళ్లీ' అన్నది వాళ్లు వినలేదో.. విన్నా అర్థం కాలేదో.. నే చెప్పినా ఎవరూ నమ్మరని నాకు తెలుసు – అందుకే మళ్లీ కళ్లు మూసుకొని నిశ్చింతగా పడుకున్నా.

(ఆంధ్రప్రదేశ్ – అగస్ట్ 2007)